

సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

నూతన విద్యావిధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నారు. వారం రోజులు కార్యక్రమాలు కొనసాగుతాయి. 8లో▸



'ఎల్లంపల్లి'కి వరద

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి వరదనీరు చేరుతోంది. పూర్తి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను సోమవారం 11టీఎంసీలకు చేరింది. కడెం ప్రాజెక్ట్ నుంచి 2,850 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 18వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది.

గరిష్టం/కనిష్టం
30.0 /26.0

వాతావరణం

వర్షం కురిసే అవకాశం ఉంది. పశ్చిమ నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గుతాయి.

కరుణిస్తారా..!

- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల గంపెడాశలు
- రైల్వే, జాతీయ రహదారులపై వినతులు
- సింగరేణీయుల ఆదాయ పన్ను మినహాయింపు
- కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులకు నిధులిస్తేనే ఊరట



మంచిర్యాల రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ఏటా జిల్లాకు నిరాశే ఎదురవుతోంది. జిల్లా పరిధిలోని సమస్యల పరిష్కారానికి అరకొర నిధుల కేటాయింపే జరుగుతోంది. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నారు. గత ఫిబ్రవరిలో సాధారణ ఎన్నికల ముందు మధ్యంతర బడ్జెట్‌ను ఆమోదించగా, తాజాగా పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మూడోసారి ఎన్డీఏ సర్కారు అధికారంలోకి వచ్చాక ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆశలు నెలకొన్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా ఈ ప్రాంత సమస్యలు తీర్చేలా, అభివృద్ధికి బాటలు పడాల్సి ఉంది.

రైళ్లు, జాతీయ రహదారులు

పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిల్లాతోపాటు ముఖ్యంగా ఉత్తర, దక్షిణ భారతదేశానికి రవాణా మార్గం మరింత సౌకర్యవంతం చేయడంతోపాటు రద్దీకి తగినట్లుగా రవాణా మెరుగుపర్చాల్సి ఉంది. మంచిర్యాల, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, రేచినీ రోడ్‌తోపాటు కాగజ్‌నగర్ వరకు, మహారాష్ట్ర పరిధి బల్లార్షా, నాగ్‌పూర్‌తోపాటు ఢిల్లీ, ఇటు దక్షిణ భారత పరిధిలో చెన్నయ్, బెంగళూరు వైపు, ఇక నిత్యం రద్దీగా వెళ్లే కాజీపేట, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తిరుపతి దాకా రైళ్లను పెంచడంతోపాటు హాల్ట్స్ పెంచాల్సి ఉంది. మంచిర్యాల పట్టణంలో నూతనంగా ఆర్వోబీ మంజూరు చేయాల్సి ఉంది. అండర్ బ్రిడ్జిలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బెల్లంపల్లి గడ్చిరోలీ జాతీయ రహదారికి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేస్తేనే పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొనసాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణాల్లో వేగం పెంచాల్సి ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వైపు, జిల్లా నుంచి వెళ్లే నిజామాబాద్–జగ్దల్‌పూర్ జాతీయ రహదారులు పూర్తి చేయాల్సి ఉంది. నిర్వాసితులకు మెరుగైన పరిహారం అందించాల్సి ఉంది. జైపూర్ మండలం నర్వా మీదుగా మంథని, వరంగల్, విజయవాడను కలిపే ఎన్‌హెచ్–163 పనులు మొదలు కావాల్సి ఉంది.

ప్యాసింజర్ రైళ్లకు వినతులు

కరోనా సమయంలో రద్దయిన ప్యాసింజర్ల రైళ్ల ఇంకా పునరుద్ధరణకు నోచు కోవడం లేదు. గత 12ఏళ్లుగా బల్లార్షా సెక్షన్‌లో కొత్త రైలు ఒక్కటి కూడా అందుబాటులోకి రాలేదు. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల్లో జనరల్ బోగీలు పెంచాల్సి ఉంది. ఇక మూడో రైల్వేట్రాక్ లైన్ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉండడంతో పలుమార్లు రైళ్ల హాల్ట్స్ ఎత్తివేస్తున్నారు. ఎన్నికల సమయంలో అందుబాటులోకి తెచ్చిన రైళ్లను యథావిధిగా పొడగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇక స్టేషన్లలో సౌకర్యాలు కొరవడుతున్నాయి. మంచిర్యాల స్టేషన్ మినహా ఎక్కడా పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేవని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్కేపీ, మందమర్రి, బెల్లంపల్లి, రేచినీ దాకా రెండు ప్లాట్‌ఫాంలు, ఫుట్ ఫ్ లెట్లు పూర్తి చేయాల్సి ఉంది. ఆదిలాబాద్–గడ్చందూర్ నూతన రైల్వే మార్గాన్ని నిర్మిస్తే ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాలకు చేరుకోవడం మరింత సులభం కానుంది. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఏపీ, సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్, తిరుపతి హంసఫర్, గాంధీధాం నుంచి విశాఖ పట్నం వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి.

సింగరేణీయుల ఆదాయపన్ను

కేంద్రం బొగ్గు గనుల కేటాయింపులు, ప్రైవేటీకరణ, సింగరేణి పరిస్థితిపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు పిలుస్తోంది. ఇక బొగ్గు కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఏళ్లుగా డిమాండ్ ఉన్నా ఏ బడ్జెట్‌లోనూ ఊరట దక్కడం లేదు. అటవీ, పర్యావరణ అనుమతులు లేక అనేక గ్రామాలకు అన్ని కాలాల్లో రవాణా సాగించే రోడ్లు లేవు. కోటపల్లి, చెన్నూరు, నెన్నెల, జన్నారం మండలాల్లో రోడ్లు వేసేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చొరవ చూపాల్సి ఉంది.

కొత్త రైళ్ల డిమాండ్లు..

సిర్పూర్ కాగజ్‌నగర్–తిరుపతి వరకు బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బల్లార్షా–షిర్డీ వయా పెద్దపల్లి–నిజామాబాదు మార్గంలో నూతన బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెడితే షిర్డీ వెళ్లే వారికి ఉపయోగంగా ఉండనుంది. ఆదిలాబాద్–కాజీపేట వరకు వయా మాజ్రీ–బల్లార్షా–సిర్పూర్ కాగజ్‌నగర్–మంచిర్యాల మీదుగా ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపితే ఉమ్మడి జిల్లాతోపాటు కాజీపేట వరకు సులువుగా చేరుకోవడానికి వీలు కలుగుతుంది.

- బల్లార్షా–కాజీపేట నుంచి బల్లార్షా(అజ్ని ప్యాసింజర్) మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును పునః ప్రారంభించి, ఈ రైలును చర్లపల్లి లేదా, హైదరాబాదు వరకు పొడగిస్తే హైదరాబాదు వెళ్లడానికి మరొక రైలు అందుబాటులోకి రానుంది.

నిధుల ప్రోత్సాహం కావాలి..

జిల్లా పరిధిలో బొగ్గు, బొగ్గు ఆధారిత పరిశ్రమలు, సిమెంట్, సిరామిక్స్, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు మొగ్గు చూపాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్య, వైద్య సంస్థలు ఏర్పాటు చేస్తే జిల్లా వాసులకు మరింత ఉపయుక్తం ఉండనుంది. జిల్లా పరిధిలో అడవులు, ప్రకృతి రమణీయత, కవ్వాల్‌టైగర్‌జోన్ తోపాటు ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రసిద్ధి. కానీ పర్యాటకంగా అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఇక్కడి ప్రజలకు మేలు కలుగనుంది. విద్య, వైద్య పరిధిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు మంజూరు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్

లక్సెట్టిపేట : వర్షాకాలం సీజనల్ వ్యాధుల కాలం. జిల్లాలోని మున్సిపాల్టీల్లో పారిశుధ్యం లోపించి, కాలువల్లో మురికి నీరు స్థిరంగా నిలిచి ఉంది. రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో పట్టణాల్లోని ఆయా సమస్యలపై మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఆయా పట్టణాల ప్రజలు నేరుగా కమిషనర్‌తో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తోంది. మున్సిపాలిటీ ప్రజలు తమ ప్రాంత సమస్యలపై కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించవచ్చు.

అంశం: పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

లక్సెట్టిపేట



కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, లక్సెట్టిపేట

సమయం : మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

79891 01751

పదోన్నతితో బాధ్యత

మంచిర్యాలక్రైం: ఉద్యోగంలో పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎస్సైగా ఏడుగురు, ఏఎస్సైగా ఆరుగురు, హెడ్ కానిస్టేబుల్‌గా 16మందికి పదోన్నతులు లభించాయి. వారందరికీ సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ పదోన్నతులకు సంబంధించిన చిహ్నాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో అశోక్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రాణరక్షణకే పోలీసు రెస్క్యూ టీమ్



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

వేమనపల్లి: ఆపదలో ఉన్న ప్రజల ప్రాణరక్షణకే పోలీసు రెస్క్యూ టీమ్ పని చేస్తోందని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం ప్రాణహిత ముంపు వరదతో రాకపోకలు నిలిచిపోయిన రాచర్ల, ముల్కలపేట మధ్యలో ఉన్న బొందచేను ఒర్రె హైలెవల్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీఆర్ఎఫ్ రెస్క్యూటీమ్‌ల తరహాలో జిల్లాలో ఏ మూలన ప్రజలకు ఆపద కలిగిన నిష్ణాతులైన పోలీసు రెస్క్యూ టీమ్‌లతో రక్షించనున్నట్లు తెలిపారు. ముల్కలపేట–రాచర్ల మధ్యలో ఉన్న రహదారి హైలెవల్ వంతెనపై ప్రమాదకరంగా వరద నీరు పోటెత్తి ప్రవహిస్తుండడంతో వంతెన అప్రోచ్ రోడ్డు కుంగిపోయిందని తెలిపారు. స్థానిక పోలీసులు ఇరువైపుల రాకపోకలు నిలిపివేసి అప్రమత్తం చేశారని అన్నారు. రెస్క్యూ టీమ్‌ల సహాయంతో డీసీపీ దగ్గరుండి ఇరువైపుల ప్రయాణికులను బోట్‌తో దాటించారు. చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సైలు శ్యాంపటేల్, రాజేందర్ పాల్గొన్నారు.

లైసెన్స్ లేనివారితో వినూత్న కార్యక్రమం



ప్ల కార్డులు పట్టించిన పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారితో హాజీపూర్ పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌పై నుంచి వాహన రాకపోకలు సాగిస్తున్న వారిని ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. హెల్మెట్, లైసెన్స్, ధ్రువీకరణపత్రాలు లేనివారితో ప్ల కార్డులు చేత పట్టించారు. ఎవరూ మా విధంగా నిబంధనలు ఉల్లంఘించకుండా వాహనాలు నడపాలని, లేదా ఇలా ప్ల కార్డులు చేత పట్టుకుని ప్రదర్శనగా ఉండాల్సి వస్తుందని, ఈ శిక్ష మీకు వద్దంటూ ప్ల కార్డులతో నినాదాలు చేయించారు.

పశువైద్యశాలలో తప్పిన ప్రమాదం



టేబుల్, కుర్చీలపై ఊడి పడిన స్లాబ్ పెచ్చులు

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి పశువైద్యశాలలో సోమవారం ఉదయం ప్రమాదం తప్పింది. శిథిల భవనం కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడి వైద్యాధికారి టేబుల్, కుర్చీలపై పడ్డాయి. ఆ సమయంలో వైద్యాధికారి లేకపోవడంతో ప్రమాదం తప్పింది. జిల్లా పశు వైద్యాధికారి శంకర్ భవనాన్ని పరిశీలించారు. పశువైద్యశాలను అద్దె భవనంలోకి మార్చుతామని తెలిపారు. నూతన భవనం మంజూరయ్యే వరకు సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మండల పశువైద్యాధికారి తిరుపతి, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణికి హాజరు కాని శాఖలకు నోటీసులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులతోపాటు జిల్లా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని వివిధ శాఖల అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌ను ఆదేశించారు. రిజిస్ట్రేషన్, ఆర్టీసీ, లేబర్, పశుసంవర్ధక శాఖ, తదితర శాఖలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పేర్కొన్నారు. భూ సమస్యలు, పట్టామార్పిడి, సరిహద్దుల గుర్తింపుపై, రేషన్‌సరుకులు అందించాలని దరఖాస్తులు అందజేశారు. విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యాయామ ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని, సంబంధిత పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని టీవీయూవీ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్ కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల హాజరు

ప్రజావాణికి కొన్ని శాఖల అధికారులు హాజరు కాకపోగా.. మరికొన్ని శాఖల కింది స్థాయి సిబ్బంది, మరికొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. గత వారం పౌరసరఫరాల శాఖ నుంచి ఎవరూ రాలేదు. ఈ వారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగి హాజరయ్యారు. మీరేందుకు వచ్చారంటే.. సారు పంపారు, వచ్చాననే సమాధానం వచ్చింది.

రోడ్లపై చెత్త పడేస్తున్నారు..

- వీధుల్లో కుక్కల స్వైరవిహారంపై ఆందోళన
- పారిశుధ్యం, మురికికాలువల దుస్థితిపై వినతుల వెల్లువ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన
- ప్రజల సహకారంతో స్వచ్ఛ మున్సిపాల్టీగా మారుస్తాం
- నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్



ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్

నస్పూర్: 'రోడ్లపై, ఓపెన్ ప్లాట్లలో చెత్త పడేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందుల సంచారంతో రోగాల బారిన పడుతున్నాం. వీధి కుక్కల స్వైరవిహారంతో ఇబ్బందులు పడుతున్నాం..' అంటూ నస్పూర్ పట్టణ ప్రజలు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ దృష్టికి తీసుకొచ్చారు. పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై సోమవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌తో 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌కు విశేష స్పందన లభించింది. కమిషనర్ స్పందిస్తూ పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలు పరిష్కరించి పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాల్టీగా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తామని, ఓపెన్ ప్లాట్లలో ఆయిల్ బాల్స్ వేసి దోమల వృద్ధిని నివారిస్తామని అన్నారు. వీధి కుక్కలను మంచిర్యాలలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు పంపించి కుక్కలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ప్రశ్న: తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ శ్రీరామచంద్రకాలనీ నుంచి మదర్స్ ప్రైడ్ స్కూల్‌కు వెళ్లే దారిలో మురికి కాలువ పూడికతో నిండి నీరు రోడ్డుపైకి, ఇళ్లలోకి చేరుతోంది. నడవడానికి ఇబ్బందులు పడుతున్నాం. వినూత్నకాలనీలోకి శ్రీశ్రీనగర్ పందుల పెంపకం కేంద్రంలోని పందులు తరచూ వస్తున్నాయి. కుక్కలు, పాములు సంచరిస్తున్నాయి. వీధి దీపాలు లేవు. కలెక్టరేట్‌కు వెళ్లే దారి బురదమయమైంది.

– హరికృష్ణ, మధుసూదన్‌రెడ్డి, వినూత్నకాలనీ

కమిషనర్: మురికి కాలువల్లో పూడిక తీయిస్తాం. రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటాం. పందుల పెంపకం యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తాం. రోడ్డుపై తాత్కాలికంగా మొరంతో గుంతలు మూసివేయిస్తాం.

ప్రశ్న: సీతారాంపల్లిలోని నేతకానివాడలో మురికి కాలువ లేక నీరు రోడ్డుపై ప్రవహించి ఇళ్లలోకి వస్తోంది. మురికి కాలువ నిర్మించాలి. లక్ష్మినగర్‌లో ఓ ఇంటి యజమాని రోడ్డు కబ్జా చేసి చెట్లు పెంచుతున్నాడు. దోమలు వృద్ధి చెందుతున్నాయి. రోడ్లపై చెట్ల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– భానుచందర్, సీతారాంపల్లి, కే.రాజు, లక్ష్మినగర్

కమిషనర్: రోడ్డు పక్కన గుంతలు తీయించి నీరు నిల్వకుండా చేస్తాం. డ్రెయిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. జేసీబీతో చెట్లు తొలగింపజేస్తాం. ఇంటి యజమానికి నోటీసులు జారీ చేస్తాం.

ప్రశ్న: ఎస్ఎల్ఆర్ కాలనీలో మురికికాలువలో పూడిక తీయకపోవడంతో చెట్లు ఏపుగా పెరిగి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. చెట్లు విద్యుత్ తీగలకు తగిలి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వీధి కుక్కలు చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాయి. నస్పూర్ టవర్స్ ఎదురుగా మురికి కాలువల నిర్మాణానికి ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసినా నిర్మించలేదు. మురుగు నీరు ఇళ్లలోకి చేరుతోంది. ఓపెన్‌ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి, నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి.

– ఏ.జయాకర్, శాంతమ్మ, ఎస్ఎల్ఆర్ కాలనీ, కే.సతీష్‌కుమార్, 10వ వార్డు మల్లికార్జున్, 19వ వార్డు, కుమార్, 22వ వార్డు

కమిషనర్: మురికి కాలువలో చెట్లు తొలగింపజేస్తాం. కుక్కల తరలింపునకు, డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపడుతాం. ఓపెన్ ప్లాట్లలో ఆయిల్ బాల్స్ వేసి దోమలు నివారిస్తాం.

ప్రశ్న: సీసీసీ రాయల్ గార్డెన్ ఎదురుగా ఆవులు రోడ్లపై ఉండడం వల్ల రాత్రి విధులకు వెళ్లే సమయంలో తగిలి కిందపడుతున్నాం. కటిక దుకాణాల నుంచి పోచమ్మ గుడి వరకు గుంతలు పూడ్చాలి.

– వెంకటరెడ్డి, షిర్కేకాలనీ, మేకల దాసు

కమిషనర్: ఆవుల యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేస్తాం. రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకునేలా చూస్తాం. రోడ్డుపై గుంతలు మూసివేయిస్తాము.

ప్రశ్న: చెత్తబండి రోజూ రాకపోవడంతో కాలనీవాసులు చెత్తను ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీంతో పందులు సంచరిస్తున్నాయి. దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. చికెన్ వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపై పడేయడంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

– ఎం.కుమార్, 22వ వార్డు, బీ.శ్రీనివాస్ 3వ వార్డు, రేణుక, 11వ వార్డు

కమిషనర్: చెత్తట్రాలీలు ప్రతీరోజు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఓపెన్ ప్లాట్ యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. చికెన్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహిస్తాం. కుక్కల తరలింపునకు చర్యలు చేపడుతాం.



ఎస్ఎల్ఆర్ కాలనీలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్

వెంటనే పరిష్కారానికి చర్యలు

'సాక్షి' ఫోన్ ఇన్ ముగిసిన వెంటనే కమిషనర్ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇత ర సిబ్బందిని పిలిపించి సమస్యల పరిష్కారానికి ఆదేశించారు. సిబ్బందితో కలిసి వెళ్లి 11వ వార్డులోని ఎస్ఎల్ఆర్ కాలనీలో డ్రెయి న్‌లో పెరిగిన పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగింపజేశారు. పూడిక తీయించి నీరు నిల్వ కుండా చర్యలు తీసుకున్నారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బురద రోడ్లతో ఇబ్బందులు

- దోమలు, కుక్కల బెడద
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు స్పందన



సాక్షి ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీ, హమాలీవాడల్లోని రోడ్లపై వర్షపు నీటితోపాటు డ్రెయినేజీ నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పాదచారులు, వాహనదారులు రోడ్లపై వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌తో 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వర్షాలతో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని, కుక్కల బెడదతో ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్‌కు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని, చిన్నారులను బయటకు పంపించలేకపోతున్నామని పలువురు ఫిర్యాదు చేశారు.

ప్రశ్న: హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్డు నంబర్–14, 27పై గుంతలు ఏర్పడి చెరువును తలపించేలా మురికి నీరు నిల్వ ఉంది. పాములు వస్తున్నాయి, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం

– సంధ్య, అశ్విన్‌కుమార్, చౌటం సునిల్, అనిల్‌కుమార్, సాయితేజ, మాధురి, పి.విజయ, భాస్కర్‌రావు, పాపయ్య

కమిషనర్: హైటెక్‌సిటీలోని రోడ్లు గుంతలుగా మారాయి. కొత్త రోడ్లు వేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఒకేసారి అన్ని రోడ్లు వేయడం కుదరదు. ప్రస్తుతం రోడ్లు ఎక్కడ ఎక్కువగా పాడయ్యాయో అక్కడ వేస్తాం. రోడ్డు నంబర్–14లో నీరు నిల్వ లేకుండా తక్షణం చర్యలు తీసుకుంటాం. పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం ద్వారా పాములు రాకుండా, దోమల కోసం ఫాగింగ్ చేపడతాం.

ప్రశ్న: వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. చెత్తాచెదారాన్ని తొలగించేలా చూడండి.

– చింతకింది పద్మావతి, ఎన్టీఆర్‌నగర్ కాలనీ

కమిషనర్: వీధి కుక్కలను వార్డుల వారీగా పట్టుకుని ఎనిమల్ కేర్ సెంటర్‌కు తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి, రేబీస్ వ్యాక్సిన్ వేసిన తర్వాత తిరిగి అదే వార్డులో వదిలేస్తున్నాం. కుక్కలను చంపేందుకు అధికారం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం, కాలనీలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కాలంతో సంబంధం లేకుండా రోడ్డుపై నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తోంది. వర్షాకాలం మరింత ఇబ్బందులు పడుతున్నాం. తాగునీరు మురికిగా వస్తోంది.

– కుమారస్వామి, హమాలీవాడ

కమిషనర్: హమాలీవాడ రైల్వేస్టేషన్ వెనుక వైపున రోడ్డుపై నీరు నిలుస్తుందని డ్రెయినేజీని నిర్మిస్తున్నాం. తొందరలోనే దానిని పూర్తి చేసి నీరు నిల్వ లేకుండా చూస్తాం. హమాలీవాడలో నీరు మురికిగా ఎందుకు వస్తున్నాయో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన చెత్తాచెదారాన్ని రాళ్లవాగు ఒడ్డున వేస్తున్నారు. దీంతో కుక్కలు, పందులు ఆ చెత్తను పక్కనే ఉన్న తమ కాలనీల్లోకి తీసుకువస్తున్నాయి.

– భీమేశ్వర్‌రావు, వికాస్‌నగర్

కమిషనర్: ప్రైవేటు ఆసుపత్రులే కాకుండా, ఎవరూ కూడా చెత్త ఎక్కడ పడితే అక్కడ వేసేందుకు అనుమతి లేదు. రాళ్లవాగు వద్ద మున్సిపల్ సిబ్బందిని ఉంచి, చెత్త ఎవరు వేస్తున్నారో వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఐబీ ఏరియా నుంచి రాంనగర్ వెళ్లే దారిలో చెత్తను ప్రతీరోజు తీసుకెళ్లడం లేదు. చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

– బూర్ల మహేందర్, రాంనగర్

కమిషనర్: పారిశుధ్య కార్మికులను పంపించి వెంటనే చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ట్రాలీలను ప్రతీరోజు పంపించి చెత్త నిల్వ లేకుండా చేస్తాం.

ప్రశ్న: వీధి దీపాలు లేక చీకటితో కాలనీ ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఒడ్డెర కాలనీ నుంచి వికాస్‌నగర్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా లారీలు, ట్రాక్టర్లు నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

– కే.రామరాజు, వికాస్‌నగర్

కమిషనర్: వికాస్‌నగర్‌తోపాటు అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పాడైన చోట కొత్త వాటి ఏర్పాటుకు టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలోనే కొత్తవాటిని ఏర్పాటు చేస్తాం. రోడ్డుపై వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయడంపై ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద పూల కుండీల నుంచి మట్టి రోడ్డుపై పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చున్నంబట్టి వాడలోని డ్రెయినేజీ కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి.

– షారుఖ్‌ఖాన్, చున్నంబట్టివాడ

కమిషనర్: ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మట్టిని వెంటనే తొలగిస్తాం. చున్నంబట్టి వాడలోని డ్రెయినేజీలోని చెత్త చెదారాన్ని తొలగించే పనులు మొదలు పె ట్టాం. రెండు రోజుల్లోపు పనులు పూర్తి చేస్తాం.

క్లుప్తంగా

గుట్కా పట్టివేత



పట్టుకున్న గుట్కాతో పోలీసులు

చెన్నూర్: పట్టణంలోని కుమ్మరిబొగుడ కాలనీలో రూ.60 వేల విలువైన గుట్కా పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం కాలనీకి చెందిన ముత్త శ్రీనివాస్, కొండమీది మధుకర్ ఇళ్లలో తనిఖీలు నిర్వహించగా గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం షాపులో చోరీ

జైనూర్: సిర్పూర్(యు) మండలంలోని పిట్టగూడ చౌరస్తాలో ఉన్న మద్యం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. పిట్టగూడ చౌరస్తాలోని శ్రీసాయి మద్యం దుకాణంలో రూ.4,14,139 విలువైన మద్యంతో పాటు రూ.9 వేల నగదును అపహరించినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం దుకాణం గుమాస్తా బానోతు దయారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అల్లో నేరెడల్లో..



నోముకుంటున్న నూతన వధూవరులు

వేమనపల్లి: అల్లో నేరెడల్లో.. అంటూ మహిళలు రాగయుక్తంగా పాటలు పాడుతుండగా నూతన వధువరులు నేరెళ్ల నోము నోముకున్నారు. గ్రామాల్లో ఓ సామాజిక వర్గానికి చెందిన కొత్త జంటలు పెళ్లయిన ఏడాది లోపు నేరళ్ల నోము నోచుకుంటారు. నేరేడి కొమ్మ తెచ్చి పసుపు, కుంకుమ రాసి కంకణం కట్టి అలంకరిస్తారు. ఇప్ప పువ్వుతో పిండి వంటలు చేస్తారు. కొత్త దంపతులు మహిళలకు వాయినాలు ఇస్తారు. నిండునూరేళ్ల సుమంగళిగా ఉండాలని మహిళలు ఆశీర్వదిస్తారు.

బురదలో దిగబడిన 108



బురదలో దిగబడిన అంబులెన్స్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి, లింగన్నపేట గ్రామాల లోత్‌రైపై ఇటీవల వంతెన నిర్మించగా అధికారుల నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో నాసిరకం మట్టివేసి తాత్కలిక రోడ్డు నిర్మాణం చేపట్టాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం అత్యవసర నిమిత్తం 108 వాహనం లింగన్నపేట గ్రామానికి వెళ్తుండగా అప్రోచ్ రోడ్డు బురద రోడ్డులోనే దిగబడి పోయింది. దీంతో అంబులెన్స్ సిబ్బంది అతికష్టంపై బయటికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే దృష్టి సారించి 12 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

- వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థుల్లో వినోదం, విజ్ఞానం పెంచేలా ప్రత్యేక ప్రణాళిక



ప్రదర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
ఆదిలాబాద్	466	107	105	65,000
మంచిర్యాల	510	96	108	29,376
నిర్మల్	533	85	117	52,667
కుమురంభీం	560	102	58	36,000

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌ఖిల్లా: నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని సర్కారు బడుల్లో సోమవా రం నుంచి ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ (విద్యా వారోత్సవాలు) నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు రోజుకో విధంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. బోధనకు ఆటంకం కలుగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని అధికా రులు ఉపాధ్యాయులను ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమాలకు సంబంధించి తీసిన ఫొటోలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. వీటిని గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇవే..

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రోజుకో విధమైన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలల్లో నీటిని ఆదా చేయడం, ఇతరులకు సహాయం చేయాలనే అంశంపై టీఎం మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహారం, కూరగాయలు, వ్యర్థాలతో బొమ్మల తయారీని చార్ట్‌ల రూపంలో ప్రదర్శించారు.

- 23న పాఠశాలల్లో అమలు చేస్తున్న న్యూమరసీ ఫండమెంటల్ లిట్రసీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ప్రదర్శించనున్నారు. సదస్సులు నిర్వహించి విద్యార్థులకు కథలు చెప్పాల్సిఉంటుంది.
- 24న క్రీడా దినోత్సవం నిర్వహించాలి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆటలు ఆడించడం, క్రీడలతో కలిగే ప్రయోజనాలు వివరించనున్నారు.జట్టు ఆడే ఆటల్లో ఫలితాలు విజయం దిశగా ఉంటాయని, క్రీడలతో మానసిక ఎదుగుదల, శారీరక దృఢత్వం గురించి తెలియజేయనున్నారు.
- 25న సాంస్కృతిక దినోత్సవం నిర్వహించాలి. ఇందులో భాగంగా వివిధ భాషలు, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వస్త్రధారణ, చిత్రలేఖనం, జానపద, నాటకాలు విద్యార్థులతో వేయించాలి. ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహించాలి.
- 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవం నిర్వహించాల్సి ఉంది. ఇందులో కోడింగ్ ఛాలెంజ్, జీవధారణ కార్యక్రమాలు, పక్షు, జంతువులపై అవగాహన, విద్యార్థులకు చారిత్రక విషయాలను తెలియజేయడం, వర్క్‌షాప్ నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థులను చారిత్రాత్మక ప్రదేశాలకు తీసుకెళ్లి వాటి గురించి వివరిస్తారు.
- 27న పాఠశాలల్లో పౌష్టికాహార దినోత్సవం నిర్వహించాలి. విద్యార్థులతో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. క్లబ్‌ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలి. మొక్కల పెంపకం, కూరగాయల తోటల పెంపకం చేపట్టాలి. మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చూడాలి.
- 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలి. అందర్నీ ఇందులో భాగస్వామ్యం చేయాలి. తల్లిదండ్రులు, దాతలను బడికి ఆహ్వానించి కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు వివరించాలి. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.

తప్పనిసరిగా నిర్వహించాలి



జిల్లాలోని ప్రతీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమాలను చేపట్టాలి. విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అమ్మ ఆదర్శ కమిటీలను, తల్లిదండ్రులు, దాతలను ఈ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలకు జియో ట్యాగింగ్ చేయాలి. నివేదికను పంపించాలి.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి...



'శిక్షా సప్తాహ' వారోత్సవాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థిని భాగస్వామ్యం చేసేలా ప్రోత్సహించాలి. రోజుకొక విభిన్న ఇతివృత్తంతో నిర్వహించే కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో చైతన్యం రగిలించాలి. ఇందులో విద్యార్థులు సృజనాత్మకత, విభిన్న ఆలోచన శక్తిని పొందుతారు. ఏడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలి.

– డా.ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

మంచిర్యాలలో..

గర్మిళ్ల పాఠశాలలో సోమవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా వినూత్నంగా బోధన సామగ్రి తయారు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని టీఎల్‌ఎంగా మలుచుకోవడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఆహారం–కూరగాయలు అనే అంశంపై ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.

స్మితా సబర్వాల్‌పై డీసీపీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ఇందూరి రమేశ్, రామ్ శ్రీనివాస్, దరావత్తు రాందాస్, దుర్శెట్టి లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

'ఏఐటీయూసీ ఆరోపణలు అర్థరహితం'

శ్రీరాంపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితమని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, నాయకులు భీంరావు, గరిగే స్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద పేద విద్యార్థులు సివిల్ సాధించేందుకు రూ.4 కోట్ల నిధులను సింగరేణి నుంచి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంస్థలు సీఎస్‌ఆర్ నిధుల కింద కొంత మొత్తాన్ని సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే నేడు ఈ నిధులను కేటాయించారన్నారు. దీనిపై ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారి వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..



డ్రెయినేజీ శుభ్రం చేయిస్తున్న అధికారులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్‌ఇన్'లో మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌కు ప్రజలు తమ సమస్యలు ఏకరువు పెట్టిన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు ఆదివారం పలు వార్డుల్లో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు నిర్వహించారు. సోమవారం కమిషనర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ 5, 15 వ వార్డుల్లో సందర్శించారు. 5వ వార్డులోని ఇందిరానగర్, కుమ్మరిబొగుడ కాలనీల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. 15 వార్డులో ఓపెన్ ప్లాట్‌లో ఉన్న చెత్తను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫోన్‌ఇన్‌లో ప్రజలు విన్నవించిన సమస్యలు పరిష్కరించేందుకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ సమీమాబేగం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తీత

సాక్షి ఎఫెక్ట్..



పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

బెల్లంపల్లి: 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు వచ్చిన ఫిర్యాదులపై రెండు రోజులుగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకుని వార్డుల వారీగా వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సోమవారం పాతబస్టాండ్ ఏరియా ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ముందు డ్రెయినేజీలో పూడిక తీయించి మురికి నీరు ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. 18 వార్డు పరిధిలో నిల్వ చేసిన చెత్త కుప్పలను డంప్‌యార్డుకు తరలించారు. ప్రగతి జూనియర్ కళాశాల పక్కన మురికినీటి కాలువలో పూడిక తీయించారు.

నెలాఖరులోగా లక్ష్యం చేరుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- వనమహోత్సవంపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: వనమహోత్సవం కార్యక్రమం లక్ష్యాన్ని నెలాఖరులోగా చేరుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్ట ర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి వనమహోత్సవ కార్యక్రమంపై సోమవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కింద జిల్లాలో 53 లక్షల మొక్కలు నా టాలని లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటివరకు 45 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల వారీగా నాటేందుకు అవసరమై న మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలి పారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల వారీగా చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, శాఖల వారీగా ఉద్యోగుల ఖాళీల వివరాలతో నివేదిక రూపొందించి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందించాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో వేమనపల్లి



పడవలో అట్టలొర్రె దాటుతున్న వైద్యసిబ్బంది

వేమనపల్లి: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రాణహిత నది పోటెత్తి ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో దారులన్నీ జలదిగ్బంధమయ్యాయి. వేమనపల్లి–సుంపుటం గ్రామాల మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు, అట్టలొర్రె వంతెన పూర్తిగా మునిగిపోవడంతో గ్రామస్తులు పడవల సాయంతో దాటుతున్నారు. జాజులపేట సమీపంలోని అంకన్న ఒర్రెవంతెన, రోడ్డు మునిగిపోయాయి. వేమనపల్లి సమీప ప్రాణహిత పుష్కరఘాట్ రోడ్డుతో పాటు ఎంచపాయ వైపు రోడ్డు పూర్తిగా నీట మునిగింది. ముల్కలపేట–రాచర్ల మధ్య ఉన్న బొందచేను ఒర్రె హైలెవల్ వంతెన పైకి వరద పోటెత్తడంతో అప్రోచ్‌రోడ్డు కొంతమేర కృంగిపోయింది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. వేమనపల్లి పీహెచ్‌సీకి చెందిన హెల్త్ అసిస్టెంట్ లింగన్న, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి పడవతో అట్టలొర్రె దాటి సుంపుటం గ్రామానికి వెళ్లి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. లోతట్టు గ్రామాలైన వేమనపల్లి, కేతన్‌పల్లి, కల్మలపేట, రాచర్ల, గొర్లపల్లి, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడం, కళ్లంపల్లి శివారులో సుమారు 2,500 ఎకరాల్లో పత్తి పంటలు నీటమునిగాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న 'ప్రాణహిత'

కోటపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వెంచపల్లి, జనగామ, సుపాక, ఆలుగామ, ఆ న్నారం గ్రామాల్లోని పత్తి చేన్లు నీటమునిగా యి. 18 గ్రామాల్లోని 864 ఎకరాల్లో పత్తి పంట నీటమునిగినట్లు ఏవో మహేందర్, ఏఈవోలు అనుష, వైష్ణవి వివరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



వెంచపల్లిలో నీటమునిగిన పత్తి చేను

సాక్షి పేపర్ చదివిస్తూ.. ప్రాక్టీస్ చేయిస్తూ..!



ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని హరిజనవాడ పాఠశాలలో చదివే విద్యార్థులకు తెలుగులో సులువుగా అర్థమయ్యేలా పాఠశాల ఉపాధ్యాయుడు రాజాబాబు ఆలోచన చేశారు. రోజూ పేపర్‌లో వచ్చే వార్తలు చదివించడంతో పాటు శీర్షికలో వచ్చే కథనాలను ప్రాక్టీసు చేయిస్తున్నారు. సులువుగా తెలుగు రావడంతో పాటు విద్యార్థులకు విలువైన సమాచారం (న్యూస్) తెలుస్తుందని ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

ఉప్పొంగిన ప్రాణహిత.. మునిగిన పంటలు



మొట్లగూడ సమీపంలోకి వచ్చిన ప్రాణహిత వరద



నందిగామ వద్ద పంట చేలలోకి చేరిన వరద



నీట మునిగిన పత్తి పంటను చూపుతున్న రైతు

దహెగాం/పెంచికల్‌పేట్/చింతలమానెపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి పరీవాహక ప్రాంతాల్లోని పంట చేలు నీట మునిగాయి. పెద్దవాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దహెగాం మండలంలోని మొట్లగూడ వరకు వరద చేరింది. మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్ సమీపంలో సుమారు 1050 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగిందని రైతులు తెలిపారు. ఏఈవో దీపక్ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పెంచికల్‌పేట్ మండలం నందిగామ, జిల్లెడ, మురళీగూడ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో వరి, పత్తి, కంది పంటలు నీటమునిగాయి. నందిగామ గ్రామానికి వెళ్లే రహదారి వరద నీటితో మునిగింది. చింతలమానెపల్లి మండలం గూడెం, దిందా, కోయపెల్లి, బూరుగూడ గ్రామాల సమీపంలో పంట భూముల్లోకి వరద చేరింది. కోయపెల్లి సమీపంలోని వంతెన వద్ద రహదారి ముంపునకు గురైంది. గూడెం, కోయపల్లి నుంచి బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఆర్టీసీకి పెరిగిన ప్రజాదరణ

- ఉమ్మడి జిల్లాలో 3.57 కోట్ల మందికి 'జీరో' టికెట్లు
- ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులు
- కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి
- రీజినల్ మేనేజర్ సోలోమాన్



మాట్లాడుతున్న ఆర్ఎం.సోలోమాన్

కైలాస్‌నగర్: ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీంతో ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 90శాతం నమోదవుతుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో మహాలక్ష్మి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 612 బస్సులుండగా నిత్యం 2.70 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారన్నారు. ఇందులో 1.50 లక్షల మంది మహిళలు ఉంటున్నట్లుగా తెలిపారు. కొన్ని బస్సుల్లో 95 నుంచి 100శాతం ఓఆర్ నమోదవుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి గడిచిన 218 రోజుల్లో 3కోట్ల 57లక్షల 54వేల 336 మంది మహిళలు ప్రయాణించగా వారికి జీరో టికెట్లు జారీ చేశామన్నారు. అలాగే డబ్బులు చెల్లించి 2కోట్ల 50లక్షల 59వేల172 మంది ప్రయాణించినట్లుగా తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులను నడుపుతున్నట్లుగా తెలిపారు. గతంలో కిలో మీటర్‌కు రూ.43.20 ఆదాయం రాగా, మహాలక్ష్మి అమలు నుంచి కిలో మీటర్‌కు రూ.57.28 ఆదాయం వస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ట్రూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా కార్మికులకు ఆరోగ్య పరిక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, మంచిర్యాలలోని డిస్పెన్సరీల్లో వైద్యసేవలందిస్తున్నట్లుగా తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తార్నాకలోని ఆసుపత్రికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నారు. అక్కడ కొత్తగా ఎంఆర్ఐ, ఐసీయూ సేవలు కూడా అందుబాటులోకి వచ్చినట్లుగా తెలిపారు. కార్మికులు ప్రయాణికులతో మర్యాదగా నడుచుకుంటూ మరింత ఆదాయం పెంచేలా శ్రద్ధ వహించాలని కోరారు. ప్రయాణికులు కూడా సంస్థను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.